క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి మురుపిళ్ల పైడిరాజు

పెందుర్తి: చినముషిడివాడ, పెందుర్తి తదితర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు ప్రభుత్వం శాశ్వత గృహాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. సుజాతనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ బర్మన్‌నగర్‌లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు. ఆర్.శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత



రాముకు సీఎంఆర్ఎఫ్ చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకున్న చింతలగ్రహారానికి చెందిన రుత్తల రాముకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా విడుదలైన చెక్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అందించారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో రాముకు రూ.1,19,119 విలువైన చెక్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యర్థాలతో నిండిన ప్రధాన కాలువ





శిథిలావస్థలో తిక్కవానిపాలెం కామన్ ఫెసిలిటీ సెంటర్



కూలిపోయేందుకు సిద్ధంగా బస్ షెల్టర్



బీటలు వారిన కామన్ ఫెసిలిటీ సెంటర్ రక్షణ గోడ

సమస్యలతో సహవాసం

- తిక్కవానిపాలెంలో మౌలిక వసతుల కరవు
- తాగునీటికి అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గంగపుత్రులు

పరవాడ: సముద్ర తీరానికి అతి సమీపంలో నివసిస్తున్న తిక్కవానిపాలెం మత్స్యకార్మికులు తీవ్ర సమస్యలతో సతమతమవుతున్నారు. సుమారు ఐదు వేల జనాభా కలిగిన ఈ గ్రామంలో సమస్యలను పరిష్కరించే నాథుడే లేకపోవడంతో గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, పారిశుధ్య సమస్యలు పెరిగిపోయాయి. గ్రామంలో సభలు, సమావేశాలు, పెళ్లిళ్ల వంటి శుభ కార్యక్రమాలు జరుపుకొనేందుకు ప్రభుత్వం 2001లో సకల సదుపాయాలతో నిర్మించిన కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్వహణ లోపాలతో శిథిలదశకు చేరుకుంది. భవనం చుట్టూ నిర్మించిన రక్షణ గోడ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. భవనాన్ని స్థానికులు టెంటు హౌస్ సామగ్రి నిల్వ చేయడానికి ఉపయోగిస్తున్నారు. భవనం లోపల గచ్చులు, తలుపులు, కిటికీలు, ప్రధాన గేట్లు పాడయ్యాయి. ప్రస్తుతం సభలు సమావేశాలు జరుపుకోవడానికి వసతి సౌకర్యాలు లేక ఆరు బయటనే నిర్వహించుకోవలసి వస్తోంది. భవనంలో మైలాన్ పరిశ్రమ ఆర్థిక సహకారంతో కొంత కాలం పాటు ఆర్వో ప్లాంటును నడిపి మరమ్మతులకు చేరుకోగానే పట్టించుకోవడం మానేశారు. 15 ఏళ్ల క్రితం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో గ్రామ ప్రజల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టరు శిథిలావస్థకు చేరింది. వర్షం పడితే కారిపోతుంది. సన్‌షేడ్ కూలిపోయింది. మురుగు కాలువల విషయానికొస్తే కాలువలన్నీ పూడికలతో నిండిపోయాయి. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు సక్రమంగా పనిచేయడం లేదు.

తాగునీటికి ఇబ్బందులు



ఇంటింటికీ కుళాయిలున్నప్పటికి తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నాం. దిగువ ప్రాంతాల ప్రజలకు పుష్కలంగా నీరందుతుండగా ఎగువ ప్రాంత ప్రజలకు నీరందడం లేదు. ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైంది. దూర ప్రాంతాల్లో ప్రవేటు వాటర్ ప్లాంట్లపై ఆధారపడి దప్పిక తీర్చుకొంటున్నాం. పారిశుధ్య సమస్యలు పట్టి పీడుస్తున్నాయి. దోమలు పెరిగిపోయాయి. విష జ్వరాల బారిన పడుతున్నాం. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించడానికి చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. –దూడ నూకాలమ్మ, తిక్కవానిపాలెం

మరమ్మతులు చేపట్టాలి



ప్రజల సౌకర్యార్థం రూ.లక్షల వ్యయంతో నిర్మించిన కామన్ ఫెసిలిటీ సెంటర్ భవనానికి మరమ్మతులు చేపట్టాలి. గ్రామంలో ఎలాంటి శుభ కార్యక్రమం చేయాలన్న ఎండ, వానలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రజలకు అందుబాటులో ఉన్న సామాజిక భవనానికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. బస్ షెల్టర్‌కు మరమ్మతులు చేపట్టాలి –సూరాడ ఎర్రయ్య, మత్స్యకార్మికుడు, తిక్కవానిపాలెం

సత్వరం చర్యలు



తిక్కవానిపాలెంలో సమస్యలు తన దృష్టికి రాలేదు. గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, మురుగు కాలువల నిర్వహణలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తాం. తన దృష్టికి వచ్చిన సమస్యలపై సత్వర చర్యలు తీసుకొంటాం. – కె.ధర్మారావు, మండల పంచాయతీ విస్తరణాధికారి, పరవాడ

సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎంకు కలెక్టర్ ప్రశంసలు



అనకాపల్లి కలెక్టరు విజయ్‌కృష్ణన్ నుంచి అవార్డు అందుకుంటున్న సింహాద్రి జీజీఎం సిన్హా

పరవాడ: విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలపై విశేష కృషి జరుపుతున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్య ప్రతినిధి, సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌ను ప్రత్యేకంగా ప్రశంసించి అవార్డును అందజేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టరు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో కలెక్టరు విజయ్‌కృష్ణన్ పాల్గొని అనకాపల్లి పరిధిలోనే కాకుండా జిల్లా నలు ప్రాంతాల్లో సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు చేయూత అందిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా సంస్థ జీజీఎం సిన్హాను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఎన్టీపీసీ యాజమాన్యంతో పాటు వివిధ ఫార్మా పరిశ్రమలు తమ సీఎస్సార్ నిధులను గ్రామీణ ప్రాంతాల్లోని అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు సింహాద్రి ఎన్టీపీసీ విశేషంగా కృషి చేసిందని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జహ్నవి, ఎన్టీపీసీ సీజీఎం బీబీ పాత్ర, ఏజీఎం హెచ్ఆర్ కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న రీ సర్వే డీటీ గణేష్ తదితరులు

సబ్బవరం: రెవెన్యూ సదస్సులలో అర్జీలు అందజేసిన ప్రతి సమస్యకు రైతులకు సత్వర పరిష్కారం లభిస్తుందని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్ పేర్కొన్నారు. మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన పలు అర్జీలను ఆయన స్వీకరించారు. రైతుల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 109 అర్జీలను స్వీకరించామన్నారు. గ్రామంలో 124 సర్వే నంబర్లకు గాను 675.36 ఏకరాల పూర్తి విస్తీర్ణ భూమి ఉందన్నారు. గత రీ సర్వేలో 2,204 ఎల్‌పీఎంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ లాలం అప్పారావు, ఆర్ఐ వీరయ్య, సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పిల్లల అప్పలనాయుడు, వీఆర్వో అప్పలరాజు, సచివాలయ సర్వేయర్ శ్రీనివాస్, అప్పలరాజు పాల్గొన్నారు.

సబ్బవరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం



వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ అధికారి శిరీషారాణి తదితరులు

సబ్బవరం: సబ్బవరం గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పరిసరాలను శుభ్రపరిచారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ నాగలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి పీఎస్ఎల్ కిరణ్ కమారి, ఎంపీడీవో పద్మజ, ఈవోపీఆర్‌డీ బి.చైతన్యతో పాటు పలు శాఖల అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన



సబ్బవరంలో కురిసిన వర్షానికి జలమయమైన రహదారి

సబ్బవరం: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో సబ్బవరంలో రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సబ్బవరంలో రహదారులపై నీరంతా పల్లంగా ఉంటే పోలీసు స్టేషన్‌కు చేరింది. దీంతో పోలీస్‌స్టేషన్ ప్రాంగణం చెరువును తలపించింది.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



అప్పన్న సన్నిధిలో విజయనగరం డీఆర్వో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం విజయనగరం డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు. స్వామికి గరుడసేవ జరిపించారు. అలగే యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

ఫార్మాసిటీ ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలు

పరవాడ: ఫార్మాసిటీలో విజయశ్రీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జున రావు వివరాల ప్రకారం..పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం లిఫ్ట్ మొరాయించడంతో కనకరావు సరిచేస్తుండగా 20 మీటర్ల ఎత్తు నుంచి కిందకు జారిపోయింది. లిఫ్ట్‌తో పాటు కనకరావు కూడా కిందకు జారిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గుర్తించిన పరిశ్రమ యాజమాన్యం హుటాహుటీన కనకరావును చికిత్స నిమిత్తం నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం కనకరావు ఆరోగ్యం నిలకడగా ఉంది. గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

క్రమశిక్షణతో నడుచుకోవాలి



విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి: విద్యార్థి దశలో క్రమశిక్షణతో నడుచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని సబ్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి అసిరితాత అన్నారు. ఓపెన్ పోలీస్ హౌస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీసులు అందిస్తున్న పౌర సేవల గురించి తెలుసుకున్నారు.

7.5 తులాల బంగారు ఆభరణాల చోరీ

- 30 తులాల వెండి కూడా..
- సాలాపువానిపాలెంలో సంఘటన



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న అడిషనల్ క్రైం ఎస్పీ మోహన్‌రావు

పరవాడ: సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన మైచర్ల అప్పారావు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. 7.5 తులాల బంగారం ఆభరణాలు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష దోచుకెళ్లారని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి... ఫార్మాసిటీలో కార్మికుడిగా పనిచేస్తున్న అప్పారావు తన భార్య పిల్లలతో సాలాపువానిపాలెం గ్రామంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. గురువారం తన భార్య పిల్లలతో కలిసి సొంతపని మీద స్వగ్రామమైన ఎం.కోడూరు వెళ్లారు. పనులు ముగించుకొని శుక్రవారం ఉదయం సాలాపువానిపాలెంలోని ఇంటికి వచ్చి చూడగా తలుపులు, లోపల బీరు పగులగొట్టి ఉంది. బీరువాలో భద్రపరిచిన పైన పేర్కొన్న ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించి అప్పారావు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సమాచారాన్ని అనకాపల్లి అడిషనల్ క్రైం ఎస్పీ మోహన్‌రావు చేరవేశారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొన్న మోహన్‌రావు బాధితుల నుంచి వివరాలు సేకరించారు. చోరీ ప్రదేశాన్ని క్లూస్ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారని కేసు దర్యాప్తులో ఉందని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

సబ్బవరం: మండలంలోని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్ రామకృష్ణ శనివారం తెలిపారు. అనకాపల్లిలో ఈ నెల 24 తేదీన ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లాల బాలుర,బాలికల టెన్నికాయిట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. పాఠశాలకు చెందిన అండర్–17 విభాగంలో పి.సాగర్, అండర్–14 విభాగంలో ఎస్.గిరీష్, రవి కిశోర్, అండర్–19 విభాగంలో పి.ప్రవీణ్ కమార్‌లు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సీఎల్ఎన్ ప్రసాద్‌లను ఆయన పాఠశాలలో అభినందించారు.